క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



హన్మకొండ అర్బన్: ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులను క్రీడల్లో ప్రోత్సహించడం ద్వారా వారిలో మానసిక ఉల్లాసం, సృజనాత్మకత పెంపొందుతుందని హనుమకొండ జిల్లా సంక్షేమాధికారి మధురిమ అన్నారు. స్పెషల్ ఒలింపిక్స్ భారత్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, మిషన్ ఇన్‌క్లూషన్ భారత్ ఆధ్వర్యంలో నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో దివ్యాంగ చిన్నారులు, సాధారణ చిన్నారులకు శుక్రవారం క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న సుమారు 150 మంది చిన్నారులకు టీ షర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ 320 -ఎఫ్ జిల్లా గవర్నర్ కె.వెంకట్‌రెడ్డి, సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ సుధాకర్ రెడ్డి, స్పెషల్ ఒలింపిక్స్ భారత్ తెలంగాణ ప్రాంత సభ్యుడు సి.రాజశేఖర్, మల్లికాంబ నిర్వాహకురాలు బండా రామలీల, ప్రొఫెసర్ పద్మ, కోడం కల్యాణ్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశాలు అమలు చేయాలి



నయీంనగర్: రోహిత్ వేముల దళితుడు అనే నిజాన్ని మాయం చేయలేరని, రోహిత్ వేముల మరణానికి కారణమైన వారిని జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ చట్టం -1989 ప్రకారం అరెస్ట్ చేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురుమిళ్ల రాజు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజు మాట్లాడుతూ రోహిత్ వేముల దళితుడు కాదని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు సైబరాబాద్ పోలీస్ అధికారులు నివేదిక ఇచ్చారని, ఆ నివేదికను ఈనెల 3న తెలంగాణ హైకోర్టుకు ఇవ్వడంతో సమాజానికి బహిర్గతం అయిందన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు కోమల, మొగిళి, దిలీప్, రమాదేవి పాల్గొన్నారు.

చేనేత వస్త్ర పరిశ్రమ రక్షణకు ఉద్యమించాలి

న్యూశాయంపేట: చేనేత వస్త్ర పరిశ్రమ పరిరక్షణ కోసం ఉద్యమించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టి.వెంకట్రాములు పేర్కొన్నారు. పరిశ్రమ, చేనేత కుటుంబాల మనుగడకే ప్రమాదం తెచ్చిన బీజేపీని ఓడించాలని ఒక ప్రకటనలో తెలిపారు. వస్త్ర పరిశ్రమ తిరిగి పుంజుకోవాలంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు కార్మికులు ముందుకు సాగాలన్నారు.

జీకే పుస్తకాల పంపిణీ



హన్మకొండ: ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (మెపా -టీ) ఆధ్వర్యంలో వేసవి శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను పంపిణీ చేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాలలో 10 రోజులుగా ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో హనుమకొండకు చెందిన విన్నర్స్ స్టడీ సర్కిల్ సహకారంతో మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ తన పుట్టినరోజును పురస్కరించుకుని పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర కమిటీ సభ్యులు సింగారపు రామకృష్ణ, తాళ్ల రవీందర్, అమ్మగారి శ్యామ్, కనుకుంట్ల రవి, వీరబోయిన వినోద్, దండు చిరంజీవి, పెండ్యాల కృష్ణ, పంతంగి భాస్కర్, నీరటి రాజు, శ్రీనివాస్, పులి లావణ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మధు ధర్మదేవ్, దిడ్డి సుభాష్, సంతోష్, రవళి, సుభాష్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకోవాలి

ఖిలా వరంగల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పుట్టిన రోజు, పెళ్లి రోజున ఒక మొక్క నాటి సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ శామంతుల ఉషశ్రీపద్మ సూచించారు. ఇంటికి రెండు పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వరంగల్ శివనగర్‌లో శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె తన ఇంటి ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో లావణ్య, శ్రీదేవి పాల్గొన్నారు

'చైతన్య' ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్



మడికొండ: స్టేషన్ పెండ్యాల శివారులోని చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసూటికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీకాంత్‌కు రాజస్థాన్‌లోని కెరీర్ పాయింట్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించినట్లు ఆయన తెలిపారు. సింథసిస్ అండ్ బయాలాజికల్ ఎవాల్యూషన్ ఆఫ్ నావెల్ బెంజిమిడజోల్ స్కాఫోల్డ్ బియరింగ్ డెలివేటివ్స్ ఆఫ్ పోటెంట్ యాంటీ కాన్సర్ డ్రగ్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ప్రొఫెసర్ పాశం వెంకన్న పర్యవేక్షణలో శ్రీకాంత్ పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ అందుకున్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

కేయూ క్యాంపస్: ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని, సమర్థవంతమైన పాలకులు, నాయకత్వాన్ని ఎంచుకోవాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా శాఖ బాధ్యులు సూచించారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. తమ ఓటు హక్కును వినియోగించుకుందాం అంటూ వాకర్స్ అసోసియేషన్, విద్యార్థి, మహిళా సంఘాల వాకర్స్‌తో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ బాధ్యుడు రాజారెడ్డి, సైనిక మాజీ ఉద్యోగి హరిబాబు, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు యాదగిరి గౌడ్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ బాధ్యులు తేరాల యుగేందర్, కొండబత్తిని రాజేందర్, యాదగిరిగౌడ్, సదానందం, శంకరయ్య, వెలుదండ శ్రీనివాస్, మేకల వెంకటయ్య, లక్ష్మీకాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..

ఓటుహక్కును వినియోగించుకోవడం బాధ్యతగా గుర్తించాలని సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ కోరారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రికార్డు సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్‌తో కలిసి వాకర్స్‌కు ఓటరు చైతన్య కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దొంతి తిరుపతిరెడ్డి, భైరి సోమన్న, చంద్రమోహన్ రెడ్డి, తోట భిక్షపతి, రమేష్, మల్లేశం, రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, సంపత్, అశోక్‌రెడ్డి, వెంకటరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓటరు చైతన్య కార్యక్రమంలో శ్రీనివాస్ తదితరులు

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

హన్మకొండ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడుతున్నందున పోలింగ్ నిర్వహణకు అధికారులంతా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎన్నికల కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఇతర అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ముందు పాటించాల్సిన అంశాలపై ఈసీ జారీ చేసిన మార్గదర్శకాలు, ఆదేశాలపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు తీసుకుంటున్న చర్యలపై సమాధానాలను ఈసీకి పంపించాలని కోరారు. పోలింగ్ తేదీ సమీపిస్తున్నందున మద్యం, డబ్బు వంటి పంపిణీ చేయకుండా ప్రత్యేక నిఘా ఉంచి, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని, పోలింగ్ సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పటిష్ట భద్రత మధ్య ఈవీఎంలను డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు, పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాలని పేర్కొన్నారు. సమావేశంలో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, సెంట్రల్‌జోన్ డీసీపీ ఎం ఏ బారి, డీఆర్‌ఓ వైవీ.గణేష్, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్‌డీఓ నాగపద్మజ, పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల ఏఆర్‌ఓలు కె.నారాయణ, వెంకటేష్, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పరశురాముడి స్ఫూర్తితో ఎదిరించాలి

హన్మకొండ కల్చరల్: దశావతారాల్లో ఒక్కటైన పరశురాముడి స్ఫూర్తితో ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎదిరించాలని తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ సూచించారు. హనుమకొండ జిల్లా పరశురామ్ దళ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని బ్రాహ్మణభవన్‌లో పరశురామ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరశురామ చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించి పురుషసూక్త విధానంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేంద్రశర్మ మాట్లాడుతూ అసమాన పౌరుష పరాక్రమవంతుడైన పరశురాముడు తల్లిదండ్రుల పట్ల ప్రేమాభిమానాలు కలిగినవాడని అన్నారు. కార్యక్రమంలో పరశురామ్‌దళ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మరిగంటి వెంకట రమణాచార్యులు, సభ్యులు దరూరి శ్రీవర్ధనాచార్యులు, గంగు మణికంఠ శర్మ, తోట పవన్, మేఘశ్యామ్, వంశీకృష్ణ, కొప్పు శ్రీను, ఠాకూర్ కిషన్‌సింగ్, మాడిశెట్టి చందు, శ్రీమన్నారాయణ, వేముగంటి సుధాకర్‌శర్మ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఉపేంద్రశర్మ, దళ్ సభ్యులు

'పనిచేయని వారిని ప్రశ్నించండి'

నయీంనగర్: పనిచేయని ప్రభుత్వాలను ప్రజలు ప్రశ్నించాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్ బి.రమాదేవి పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకుండా 10 ఏళ్ల పాలన సాగించిన బీజేపీ.. కేంద్రంలో మరోసారి అధికారంలోకి ఎలా వస్తుందని ప్రశ్నించారు. కళ, అనిత, సదాలక్ష్మి, కుమారస్వామి, ప్రవీణ్‌కుమార్, ఇంద్రసేన, ఉదమ్‌సింగ్, మొగిలి, రాజు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సంఘం నాయకులు శుక్రవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగవెల్లి సురేష్‌కుమార్, కోమోజి జగన్, మొగిలిచర్ల సతీష్ పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారణ

హన్మకొండ అర్బన్: నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో అక్షయ తృతీయ పురస్కరించుకొని హనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో సుమారు 400 మంది శుక్రవారం హనుమాన్ దీక్షా మాలధారణ స్వీకరించినట్లు ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచారి తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాయిని

కాజీపేట: నియంతృత్వ, కుటుంబ పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో నానాటికి పెరుగుతున్న ఆదరణతో కేంద్రంలోనూ అధికారంలోకి వచ్చేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులకు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి కాజీపేటలో శుక్రవారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సుంచు అశోక్, గుంటి కుమారస్వామి, ఎండీ.అంకూస్, పి.ఆంజనేయులు, చిలుకపాటి శివకుమార్, అజ్గర్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

మోదీని ఓడిద్దాం.. రాజ్యాంగాన్ని రక్షిద్దాం

మడికొండ: మోదీని ఓడిద్దామని, భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. ఈమేరకు కరపత్రాలను మడికొండలో ఆవిష్కరించారు. ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కొమ్ముల సురేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరాల సందీప్, రాష్ట్ర కార్యదర్శి సంగారపు రవిప్రసాద్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కిషన్ పాల్గొన్నారు.

నగరంలో పోలింగ్ శాతాన్ని పెంచాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్పీలు, వైద్య సిబ్బంది

వరంగల్ చౌరస్తా: ఓటు హక్కు వినియోగించుకోవడాన్ని ప్రతీ పౌరుడు బాధ్యతగా భావించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య విజ్ఞప్తి చేశారు. వరంగల్ లోక్‌సభ నియోజక వర్గం పరిధిలోని తూర్పు నియోజక వర్గానికి సంబంధించి స్వీప్ -2024 అవగాహన కార్యక్రమాన్ని వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదు కావడం సరికాదన్నారు. మహా నగర ప్రజలు పోలింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ ఫొటో తీసుకోవడంతో పాటు ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆర్పీలు, వైద్య సిబ్బందితో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీపీఆర్‌ఓ అయూబ్ అలీ, సీడీపీఓ విశ్వజ, తహసీల్దార్ ఇక్బాల్, వరంగల్ తూర్పు నియోజకవర్గ స్వీప్ నోడల్ అధికారి కోలా రాజేశ్‌కుమార్ గౌడ్, డిపో మేనేజర్లు మోహన్‌రావు, సురేష్, మెడికల్ ఆఫీసర్లు మానస, అర్చన, పల్లవి, అఖిల్, టీఎంసీ రమేష్, సీనియర్ సిటిజన్లు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, మల్లారెడ్డి, సంజీవరెడ్డి, సీఓలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

ఖిలా వరంగల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరామ్‌నాయక్ హెచ్చరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, సివిల్ పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఓటర్లు నాయకుల ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అండర్ బ్రిడ్జి నుంచి మధ్యకోట ఖుష్‌మహల్ గ్రౌండ్ వరకు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు గోపి, ఎం.శివకుమార్, పి.మల్లయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, కేంద్ర బలగాలు, ఎస్సైలు మున్నీరుల్లా, మహిమూద్, గోవర్ధన్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలతో ఏసీపీ

బీజేపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి



మట్టి కుండ తయారు చేస్తున్న ప్రదీప్‌రావు

కాశిబుగ్గ: భారతీయ జనతా పార్టీతోనే దేశంలో అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. 27వ డివిజన్ గిర్మాజీపేటలో శుక్రవారం ఇంటింటా ప్రచారం చేస్తూ బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రధాని మోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో తమ్మిశెట్టి క్రాంతి, కనుకుంట్ల రంజిత్, పోలెపాక బాబు, తాటికొండ ప్రసాద్, కట్కూరి సుధాకర్, బండి నగేష్, పర్శ శ్రీనివాస్, కొత్తకొండ అరుణ్, రాంచందర్, మౌనిక, శివ, సంతోష్, ఆవ్విన్, యుగేందర్ పాల్గొన్నారు.

పార్టీ అధికారంలో ఉంటేనే దేశానికి రక్షణ

కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే దేశానికి రక్షణగా ఉంటుందని బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తనయుడు ఎర్రబెల్లి వినీత్‌రావు, ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ తనయుడు అరూరి విశాల్ అన్నారు. 18వ డివిజన్‌లో శుక్రవారం ఇల్లిల్లు తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని వివరించారు. మరోసారి మోదీని ప్రధాని చేయాలని, అందుకోసం అరూరి రమేష్‌ను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మార్టిన్ లూథర్, బొడ్డు రాకేష్, వస్కుల అజయ్, వివేక్, జన్ను శ్రావణ్, కేశపాక కుమార్, బొట్ల వినయ్, పోలెపాక నవీన్, మౌనిక పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

హన్మకొండ: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మారపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ (టీజీఏ) రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి పిలుపునిచ్చారు. 30వ డివిజన్, కొత్తూరులో 5వ డివిజన్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు మరింత కష్టించి పని చేయాలన్నారు. కార్యక్రమంలో 52వ డివిజన్ ఇన్‌చార్జ్ వీరేందర్, 30వ డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, మాజీ కార్పొరేటర్ మేకల బాపూరావు, నాయకులు అశోక్, రజిత, సారం రఘు, జూకంటి రాము, లక్ష్మణ్, మహ్మద్ ఫిరోజ్, స్వామి, బాబు, అశోక్, రాకేష్, సత్తెమ్మ, రేణుక, రాజు యాదవ్, సుజాత, రాజు, రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదవరెడ్డి

శ్వేతార్క ఆలయంలో వసంతోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో 26వ వసంతోత్సవ (పుట్టినరోజు) వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉత్సవాలను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, రమ దంపతులు ప్రారంభించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, చందనోత్సవ అలంకార దర్శనం, వినాయక వ్రత పూజ, కోటినామ పారాయణం, మహాగణపతి హోమం, సహస్ర గౌరీపూజలు కనులపండువగా సాగాయి. పార్వతీ పరమేశ్వరుల ముద్దుల తనయుడు ఆదిగణపతికి హిమ పర్వత అలంకరణ చేశారు. సుప్రభాతసేవతో ఆరంభమైన ఉత్సవాల్లో గోమాయ, గోమూత్ర, గో క్షీరోదకాలతో ఆలయంలో శుద్ధి కార్యక్రమాన్ని జరిపించారు. వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ, ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వర్లు శర్మ, ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ, ఆలయ ఇన్‌చార్జ్ చొక్కారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

కాజీపేట: ప్రమాదంలో ఉన్న భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఓటర్లపైనే ఉందని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని దళిత బహుజన పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ దూడల సాంబయ్య పిలుపునిచ్చారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ కుల వర్గీకరణ పేరుతో మతోన్మాదులతో చేతులు కలిపిన మంద కృష్ణమాదిగ ద్వంద్వనీతిని నిలదీయాలని సూచించారు. సమావేశంలో కోండ్ర నర్సింగరావు, గాడిపల్లి మధు, తాళ్లపల్లి సామ్రాట్ పాల్గొన్నారు.

కడియం కావ్యను గెలిపించుకుందాం

కేయూ క్యాంపస్: కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించుకుందామని, రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కాకతీయ యూనివర్సిటీ జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ప్రేమ్‌సుందర్, జేఏసీ వైస్ చైర్మన్ డాక్టర్ మేడారపు సుధాకర్ అన్నారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్లపెల్లి నరేష్, గుండేటి సుమన్, మహబూబ్ పాషా, అభిరామ్, రమేష్, శ్రీసాయి, కృష్ణమూర్తి, సతీష్, రాంబాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

27వ డివిజన్‌లో కాంగ్రెస్ ప్రచార ర్యాలీ

వరంగల్ చౌరస్తా: చేతి గుర్తుకు ఓటు వేసి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ తూర్పు నియోజకవర్గంలోని 27 డివిజన్‌లో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అబ్బనికుంట, యాకూబ్‌పుర, దయానంద కాలనీ, రాంకీ కాలనీ, గోవింద రాజు గుట్ట, ఎల్బీఆర్ కాలనీ, శ్రీకృష్ణ కాలనీ, గిర్మాజీపేటలో నినాదాలు చేస్తూ ర్యాలీలో నిర్వహించారు. కార్యక్రమంలో 27వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జ్ నాగపురి సంజయ్ బాబు, నాయకులు బాషపాక సదానందం, రంజిత్, మహిళా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు గూడ శారద, గుల్లపల్లి రామకృష్ణ, జారతి వెంకట్, ఎర్రం కమల్, మంద శ్రీనివాస్ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి

ఖిలా వరంగల్: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ఎంతో కృషి చేస్తోందని, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ మైనార్టీ ఇన్‌చార్జ్ ఎస్‌కె.జలీల్, తవక్కల్ వెల్ఫేర్ ట్రస్టు ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ ఎంఏ.జబ్బార్ పిలుపునిచ్చారు. వరంగల్ ఎస్ ఆర్‌ఆర్‌తోటలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో వసీం, ముగ్దూం, ఎండీ.హసన్, ఎండీ.మాషూక్, ఎండీ.గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన నాయకులు

కాజీపేట రూరల్: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్ 47వ డివిజన్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని తెలంగాణ స్టేట్ ఆయిల్ సీడ్స్, గ్రోవెర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ నాయకుడు సందెల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డీజిల్‌కాలనీ చౌరస్తా నుంచి బాపూజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వరకు ప్రచారం చేశారు. ఇమ్మడి బాబు, కాసర్ల నాగేష్, సురేందర్, గంగుల రాజిరెడ్డి, రమేష్, అర్చన, కృప, వంశీ, మున్నా పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

కాశిబుగ్గ: కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్ పిలుపునిచ్చారు. 19వ డివిజన్‌లో శుక్రవారం ఇల్లిల్లు తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో నాయకులు మేడిది మధుసూదన్, కూచన రవీందర్, అంబి సాంబరాజు, మాదినేని మల్లేశం, శ్రీధర్ రెడ్డి, పల్లకొండ హరి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం రద్దుకు బీజేపీ యత్నం

హసన్‌పర్తి: రాజ్యాంగం రద్దుకు బీజేపీ యత్నిస్తోందని మాజీ ఎంపీటీసీ గిన్నారపు సుగుణ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంలో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోరుతూ సీతంపేటలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ చిర్ర స్వప్న, నాయకులు యుగంధర్, రణధీర్, యుగంధర్, రాజయ్య, చిర్ర తిరుపతి, రాజు, రోహిత్, మురళి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

వరంగల్: వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్ ఆధ్వర్యంలో లారీ ఓనర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి హనుమకొండ రాంనగర్‌లో కండువాలు కప్పి పార్టీలోకి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎండీ.హసన్, శేరు సతీష్, సందీప్, సద్దాం, సాంబయ్య, మంజూర్, అమ్జద్, రాజేష్, శ్రీకాంత్, దిలీప్, ప్రకాష్, సమీర్, వేదాంత్, ఫసి, భరత్, నిఖిల్, పూర్ణచందర్, ధనలక్ష్మి ఉన్నారు.

సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

ఖిలా వరంగల్: ఉద్యమకారుడైన సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కోరారు. ఖిలా వరంగల్ పడమర కోట జంక్షన్‌లో శుక్రవారం కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ఉద్యమకారుడికి, ఉద్యమ ద్రోహులకు మధ్య జరుగుతున్న ఎన్నిక అని చెప్పారు. మెట్టు శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్, కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, మసూద్, బోగి సురేష్, డాక్టర్ హరి రమాదేవి, అచ్చ విద్యాసాగర్ పాల్గొన్నారు.

64వ డివిజన్‌లో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

మడికొండ: బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రొయ్యల లక్ష్మణ్ కుమార్, వెన్నమల్ల రమేష్, ముక్క రవికుమార్, ఎదునూరి రవీందర్, బొల్లికొండ రవీందర్, గంగారపు వీరేష్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు జాంబవ సంఘం మద్దతు

కాజీపేట రూరల్: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్‌కు కాజీపేట జాంబవ సంక్షేమ సేవా సంఘం సభ్యులు శుక్రవారం మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశారు. అనంతరం తీర్మాన కాపీని సుధీర్‌కుమార్‌కు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నార్లగిరి రమేష్, ఎండీ.అఫ్జల్‌పాషా, జాంబవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇమ్మడి రవి, ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సిరిపాక కుమారస్వామి, ఇమ్మడి బాబు, గాజుల విజయ్, మాచర్ల సుధాకర్, బి.వేణురాజ్, దుప్పటి మధు, సిరిపాక ప్రశాంత్, కల్యాణ్ పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి



న్యూశాయంపేట: మతోన్మాద ఫాసిస్ట్ బీజేపీ, దాని మిత్ర పక్షాలను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాయల చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఎన్నికల జనరల్‌బాడీ సమావేశాన్ని జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అధ్యక్షతన హనుమకొండ న్యూశాయంపేటలో నందనార్ మాల కల్యాణ పరిచయ వేదిక హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ పదేళ్ల కాలంలో ప్రజలను బీజేపీ నిలువుదోపిడీ చేసిందని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చంద్ర, గడ్డం సదానందం, కొమురయ్య, లింగన్న, మల్లన్న, భద్రాచారి, రవి, బాలరాజు, రమేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.